PRGI No: TGBIL/25/A0946

విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

approved by Govt of INDIA, TELANGANA
DK MEDIA
OUR SERVICES
* NEWS PAPER * DK ADS & PROMOTIONS
* NEWS CHANNEL * DK PRINTERS
* DK GRAPHICS * DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 02 సంచిక : 90 గురువారం, అక్టోబర్ 29 2026, పేజీలు - 4 వెల : 5 రూ/-

సర్ పేరుతో ఓట్ల తొలగింపు.

కేంద్రంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపణలు

హైదరాబాద్, అక్టోబర్ 28: ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకొని సర్ పేరుతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఓట్లను తొలగిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. ా×=పై రెండు సంవత్సరాల నుంచి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల తొలగింపు నిజమేనని తేటతెల్లం అయ్యిందన్నారు. తొలగించిన ఓట్లను పునఃపరిశీలించి. వారికి ఓటు హక్కు కల్పించాల ని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం నిద్రపోతున్నట్లు నటిస్తోందని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా నవంబర్ 1న ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు చెప్పారు.రైళ్లలో ప్రయాణం చేయడానికి అనుమతి అడుగుతుంటే కేంద్రం నుంచి అనుమతి రాలేదని మంత్రి తెలిపారు. గత పది రోజుల నుంచి ఇండియా కూటమిని ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. రైల్వే అంటే కేంద్ర ప్రభుత్వం, బీజేపీ సొత్తు కాదన్నారు. రైళ్లు, బోగీలు ఇవ్వనందుకు పీసీసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు ఒక్కొక్కటి బయట పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

నీటి నాణ్యతపై ఎక్కడా

రాజీ పడవద్దు

- ట్రీటెడ్ వాటర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- హైద్రరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఎస్‌టీపీలు, ట్రీటెడ్ వాటర్‌పై రేవంత్ రెడ్డి సమీక్ష జరిపారు.
- త్రీ ప్లాంట్లపై హైడ్రా మానిటరింగ్ ఉండాలని సీఎం ఆదేశించారు.

: ట్రీటెడ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ఏఐ వినియోగించాలన్న సీఎం రేవంత్ రెడ్డి నీటి నాణ్యతపై ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ఎస్ టీపీలు, ట్రీటెడ్ వాటర్‌పై రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.ప్రతి ప్లాంట్ వద్ద స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని, ఈ ప్లాంట్లపై హైడ్రా మానిటరింగ్ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఓఆర్ఆర్, ఇతర చోట్ల ల్యాండ్‌స్కేప్‌లు, రోడ్ క్లీనింగ్‌కు ట్రీటెడ్ వాటరే వాడాలని, సెక్రటేరియట్, సీఎంవో, పబ్లిక్ పార్కుల్లో ట్రీటెడ్ వాటర్ వినియోగించాలని సూచించారు. రైల్వే, మెట్రో రైల్‌ను ఈ పరిధిలోకి తీసుకురావాలని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో వంద శాతం ట్రీటెడ్ వాటర్ వాడాల్సిందేనని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ట్రీటెడ్ వాటర్ ట్యాంకర్లను ట్రాక్ చేయాలని, ట్రీటెడ్ వాటర్ కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, ట్రీటెడ్ వాటర్‌నే వాడాలని భవన అనుమతుల్లోనే నిబంధన విధించాలని తెలిపారు. ట్రీటెడ్ వాటర్ ప్లాంట్లను సోలార్‌తో నడిపే అవకాశాలను పరిశీలించాలని, ప్రైవేట్ ఎస్‌టీపీలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

ఆర్నబ్ తుఫాన్‌పై

సీఎం చంద్రబాబు సమీక్ష..

- సీసీ కెమెరాలతో పరిస్థితుల పరిశీలన
- యంత్రాంగం పూర్తిగా అలర్ట్.

అమరావతి, అక్టోబర్ 28: రాష్ట్రంలో ఆర్నబ్ తుఫాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై కీలక ఆదేశాలు ఇస్తున్నారు. తాజాగా సెక్రటేరియెట్‌లోని ఆర్టీజీఎస్ నుంచి సీసీ కెమెరాల ద్వారా తుఫాన్ ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితిని పరిశీలించారు. ఆర్నబ్ తుఫాన్ గమనాన్ని.. ప్రస్తుతం క్షేత్రస్థాయిలోని పరిస్థితిని సీఎంకు ఆర్టీజీఎస్ అధికారులు వివరించారు. వివిధ ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడంతో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయా అని సీఎం.. అధికారులను అడిగి తెలుసుకున్నారు.జాతీయ రహదారులతో పాటు ఇతర చోట్ల ఏమైనా చెట్లు విరిగిపడితే వెంటనే తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని సీఎం సూచించారు.

తెలంగాణలో భారీగా

ఐఏఎస్‌ల బదిలీలు

- కీలక శాఖలకు కొత్త అధికారులు

హైదరాబాద్, అక్టోబర్ 28: తెలంగాణ ప్రభుత్వం పాలనా యంత్రాంగంలో కీలక మార్పులు చేపట్టింది. పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ బదిలీలు, పోస్టింగులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. జయేష్ రంజన్‌కు పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ (జుఖీూ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించగా.. వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. నవీన్ మిట్టల్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలు అప్పగించింది. శైలజా రామయ్యర్‌కు రెవెన్యూ (ఎండోమెంట్స్) శాఖ, ఏ.వాణి ప్రసాద్‌కు క్రీడలు, హెరిటేజ్ తెలంగాణ బాధ్యతలు కేటాయించింది. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించగా, కె. ఇలంబర్తిను రవాణా శాఖ కార్యదర్శిగా నియమించిందిఇతర మార్పుల్లో భాగంగా సర్ఫరాజ్ అహ్మద్‌కు జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలు అప్పగించారు. శృతి ఓజాకు మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖల బాధ్యతలు కేటాయించారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధికి తీవ్ర

అన్యాయం జరిగిందని ఆరోపణ

- తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై బండి సంజయ్ విమర్శలు
- కరవు మండలాల జాబితా అశాస్త్రీయమన్న బండి సంజయ్

హైదరాబాద్, అక్టోబర్ 28: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ జాబితా అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు.ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నా రు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసి ల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడు తున్నా ప్రభుత్వం పట్టించు కోకపోవ డం దారుణమన్నారు. నష్టపరిహారం ఖర్చులు తప్పించుకో వాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వ కంగా విస్మరించా రా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు.

కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం.

యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు

- ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట
- ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు కోర్టు నోటీసుల జారీ
- కేసు తదుపరి విచారణ నవంబర్ 6కు వాయిదా

హైదరాబాద్: ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, వారి వాదనలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సూచించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది.

మూసీ ప్రజాభిప్రాయ

సేకరణకు అడ్డంకులా?..

హైదరాబాద్, అక్టోబర్ 28: మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్ట్ చేయటాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటని మండిపడ్డారు. కరవు రైతులను ప్రభుత్వం ఆదుకోవడం లేదని విమర్శిం చారు. కాంగ్రెస్‌కు తెలంగాణ సమాజం బుద్ధి చెప్పడం ఖాయమని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.'మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్ట్ చేయటాన్ని ఖండిస్తున్నాను. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన

బంజారాహిల్స్ ఎస్ఐ

హైదరాబాద్ :హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఓ కేసులో సహాయం చేసేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆయ నపై ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. బంజారాహి ల్స్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న విజయ్, ఓ ఫిర్యా దుదారుడి నుంచి రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. దీనిపై బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం, బుధవారం ఫిర్యాదుదారుడి నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఎస్ఐ విజయ్‌ను పట్టుకున్నారు.

'భారతీయ వ్యాపార సంస్థలు మోదీ, షా

ఆటవస్తువులు కావు

న్యూ ఢిల్లీ : టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకం నేపథ్యంలో చెలరేగిన వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారతీయ వ్యాపార రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమ ఆటవస్తువులా చూస్తున్నారని ఆరోపించారు. దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు ఈ విషయాలపై మాట్లాడటానికి భయపడుతున్నారని 'ఎక్స్' వేదికగా తెలిపారు.

"టాటా సంస్థను నేరపూరితంగా నాశనం చేస్తున్నారు. అయినా ఒక్క వ్యాపారవేత్త కూడా దీనిపై మాట్లాడడానికి సాహసించడం లేదు. మీరు ఇంకెంత కాలం మౌనంగా ఉంటారు? వాళ్లు మిమ్మల్ని పూర్తిగా లొంగదీసుకునేంత వరకా? భారతీయ వ్యాపార రంగం మోదీ, షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, కానీ మాకు ఉంది. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగా మేము కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తాం." అని రాహుల్ గాంధీ పోస్ట్ చేశారు.

ప్రజల జీవితాల్లో మార్పు

తీసుకురావడమే ఏఐ వినియోగ లక్ష్యం

హైదరాబాద్, అక్టోబరు 28 : ఏఐతో ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఏఐ వినియోగ లక్ష్యమని పేర్కొన్నారు. 'ఏఐ సాక్షమ్' ప్రారంభోత్సవంలో భట్టి విక్రమార్క (బుధవారం) పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఆయా కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయాన్ని ప్రజలకు కేటాయించాలని సూచిం చారు.రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యం పెంపొందించేందుకే 'ఏఐ సాక్షమ్'ను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజాధనం వినియోగం, ప్రాజెక్టుల వ్యయాల విశ్లేషణకు ఏఐ ఉపయోగపడుతుందని వివరించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయో, లేదో గుర్తించవచ్చని చెప్పుకొచ్చారు. విద్యుత్ డిమాండ్ అంచనా, పరికరాల లోపాల గుర్తింపులో ఏఐ కీలకంగా ఉపయోగపడుతుందని వెల్లడించారు.ప్రభుత్వ ఉత్తర్వులు, నివేదికల తయారీలో ఏఐతో సమయం ఆదా అవుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఏఐ ఇచ్చే సమాచారాన్ని అధికారులు తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత సమాచార భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ఏఐ నిర్ణయాలపై పర్యవేక్షణ తప్పనిసరి అని చెప్పారు.

ట్రాన్స్‌జెండర్లకు సీసీఎస్ ఏసీపీ శ్రీశైలం కౌన్సెలింగ్

- ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా గౌరవప్రదంగా జీవించాలి
- సమస్యలు ఎదురైతే 14427 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలి

నిజామాబాద్, అక్టోబర్ 28: ట్రాన్స్‌జెండర్లు చట్టాలను గౌరవిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా శాంతియుతంగా జీవించాలని సీసీఎస్ ఏసీపీ శ్రీశైలం సూచించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ట్రాన్స్ జెండర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీశైలం మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా జీవించాలని, ఇతరులకు ఇబ్బందులు కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా వ్యవహరించాలని, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడ రాదని స్పష్టం చేశారు.అనంతరం ట్రాన్స్ జెండర్లు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామాజిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఎదురైనప్పుడు నిరుత్సాహానికి గురి కాకుండా చట్టపరమైన మార్గాలను ఆశ్రయి ంచాలని సూచించారు. అవసరమైన సహాయ ం కోసం సంబంధిత అధికారులను సంప్రదిం చాలని, సమస్యల పరిష్కారానికి అందుబా టులో ఉన్న మార్గాలను వినియోగించుకో వాలని తెలిపారు.ట్రాన్స్‌జెండర్లకు ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైతే సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14427ను సంప్రదించాలని సూచించారు. ప్రజల్లో శాంతిభద్రతలను కాపాడటంతోపాటు, ట్రాన్స్ జెండర్ల సమస్యలను గుర్తించి వారికి తగిన మార్గదర్శకత్వం అందించడమే కౌన్సెలింగ్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్ర మంలో సీసీఎస్ సీఐలు సురేష్, అజయ్, సాయినాథ్, ఎస్సైలు మహేష్, భీంరావు, మహిళా ఆర్ఎస్ఐ స్రవంతి, సఖీ కేంద్రం ఇన్‌చార్జి భాను ప్రియతోపాటు జిల్లా ట్రాన్స్‌జెం డర్లు పాల్గొన్నారు.

నందిపేట్ కొత్త తహసీల్దార్‌గా సురేశ్ పామురే

- ఉత్తర్వులు జారీ.. సోమవారం బాధ్యతల స్వీకరణ
- కొన్ని రోజులుగా ఖాళీగా ఉన్న పోస్టులో కొత్త అధికారి నియామకం

నందిపేట్, అక్టోబర్ 28: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ పరిధిలోని నందిపేట్ మండల కొత్త తహసీల్దార్‌గా సురేశ్ పామురే నియమితులయ్యారు. ఆయన నియామకానికి సంబంధించి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన నందిపేట్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.
గతంలో నందిపేట్ తహసీల్దార్‌గా పనిచేసిన జి. సంతోష్ రెడ్డి సస్పెన్షన్‌కు గురైన నేపథ్యంలో ఈ పోస్టు కొన్ని రోజులుగా ఖాళీగా ఉంది. తాజాగా సురేశ్ పామురే నియామకంతో మండలంలో రెవెన్యూ పరిపాలనకు కొత్త అధికారి రానున్నారు.

నందిపేట్‌కు అసిస్టెంట్ కలెక్టర్ పాములి నరేశ్ రాక

ఈ క్రమంలో 2025 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి, అసిస్టెంట్ కలెక్టర్ పాముల నరేశ్ బుధవారం నందిపేట్ మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక డిప్యూటీ తహసీల్దార్ అనంత్ లక్ష్మణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్ సింగ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ఆశలు

కొత్త తహసీల్దార్ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత దరఖాస్తులు, రెవెన్యూ సమస్యలు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై స్థానికులు ఆశలు పెట్టుకున్నారు. కొత్త అధికారి పాలనలో రెవెన్యూ సేవలు మరింత వేగవంతం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బల్దియాలో లంచాల బాగోతం ప్రతి పనికీ పైసలేనా

- జనన ధ్రువీకరణ పత్రానికి రూ.3 వేలు డిమాండ్ చేశారంటూ ఆరోపణలు
- ఇంటి నిర్మాణం కోసం డబ్బులు ఇవ్వాలని సూచించారంటూ మరో బాధితుడి వాదన
- మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన.. విచారణ జరిపించాలని డిమాండ్

కామారెడ్డి, అక్టోబర్ 28:
పౌర సేవలకు పైసలివ్వాల్సిందేనా? మున్సిపల్ కార్యాలయంలో పని జరగాలంటే డబ్బులు చెల్లించాల్సి వస్తోందాకామారెడ్డి మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. జనన ధ్రువీకరణ పత్రం ఆమోదం కోసం డబ్బులు అడిగారని ఒకరు, కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్నారని మరో బాధితుడు ఆరోపించారు. తమకు ఎదురైన ఇబ్బందులను నిరసిస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కమిషనర్‌తో పాటు కిందిస్థాయి అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
రూ.3 వేలు అడిగారు.. రూ.2,500 ఇచ్చాకే పని పూర్తయిందట! టేక్రియాల్ గ్రామానికి చెందిన సందీప్ తన కుమారుడి జనన ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ దరఖాస్తును ఆమోదించేందుకు రూ.3 వేలు డిమాండ్ చేశారని ఆరోపించారు. చివరకు రూ.2,500 చెల్లించిన తర్వాతే దరఖాస్తు ఆమోదించారని పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వకపోవడంతో సుమారు మూడు నెలల పాటు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చిందని వాపోయారు.సాధారణం గా పూర్తికావాల్సిన పౌర సేవ కోసం నెలల తరబడి వేచి ఉండాల్సి రావడం, డబ్బులు చెల్లించిన తర్వాతే పని పూర్తయిందని ఆయన చేసిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.

కోర్టు స్టే ఉన్నా పనులు ఆపించారంటూ మరో ఆరోపణ!

మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో ఇంటి నిర్మాణం విషయంలోనూ వివాదం నెలకొంది. ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకున్న తర్వాత, మున్సిపల్ స్థలంలో నిర్మాణం చేపడుతున్నారనే కారణంతో తన ఇంటి పిల్లర్లను కూల్చివేశారని గాంధారికి చెందిన చిరంజీవి ఆరోపించారు.ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించగా, నిర్మాణ పనులు నిలిపి వేయవద్దంటూ స్టే ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. రెండు రోజుల క్రితం కోర్టు ఉత్తర్వుల ఆధారంగా తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించగా, ప్రశాంత్ అనే వ్యక్తిని తన ఇంటి వద్దకు పంపించి పనులు నిలిపివేయించారని ఆరోపించారు.ఈ విషయంపై మున్సిపల్ కార్యాలయంలో ప్రశాంత్‌ను కలిసినప్పుడు, కమిషనర్‌కు ఎంతోకొంత డబ్బులు ఇచ్చి పనులు చేసు కోవాలని సూచించినట్లు చిరంజీవి పేర్కొ న్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.

ప్రజా సేవలకు లంచాలా? ఉన్నతాధికారులు స్పందించేనా?

జనన ధ్రువీకరణ పత్రాలు, భవన నిర్మాణ అనుమతులు వంటి పౌర సేవల్లో పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉంది.
అయితే, పనుల కోసం డబ్బులు అడుగుతున్నారంటూ బాధితులు చేసిన ఆరోపణలు మున్సిపల్ పాలనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.
బాధితుల ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందిస్తారా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీస్తారా బాధ్యులుగా తేలిన వారిపై చర్యలు తీసుకుంటారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

డెంగ్యూ నివారణకు ఉమ్మడి కృషి

అవసరం డాక్టర్ అహ్మద్

పటాన్ చెరు, అక్టోబర్ 28(విశాలజ్యోతి),
డెంగ్యూ వంటి నిర్లక్ష్యానికి గురవుతున్న ఉష్ణ మండల వ్యాధులను ఎదుర్కోవడానికి శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, సామాజిక పరిశోధకులు కలిసి పనిచేయాలని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫర్హాన్ అహ్మద్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సెమినార్‌లో వాతావరణ మార్పుల ప్రభావం, సురక్షితమైన సమర్థవంతమైన వ్యాక్సిన్ల రూపకల్పనపై ఆయన వివరించారు.

మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం

- నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిజామాబాద్‌లో విద్యార్థుల భారీ ర్యాలీ
- మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ.. యువతలో అవగాహన కల్పించాలని పిలుపు
- ర్యాలీలో పాల్గొన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జెస్సు అనిల్ కుమార్

నిజామాబాద్, అక్టోబర్ 28:
మాదకద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్తు దెబ్బతినకుండా, సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 'నషా ముక్త్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు.జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పోతంకర్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఎన్టీఆర్ చౌరస్తా నుంచి రాజీవ్ గాంధీ ఆడిటోరియం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, కుటుంబాలపై పడే ప్రభావం, యువత భవిష్యత్తుకు కలిగే నష్టాలపై వక్తలు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతోపాటు, వాటి దుష్పరిణామాలపై ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాలను వినియోగించబోమని, ఇతరులు వాటికి దూరంగా ఉండేలా చైతన్యం కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు.
అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి సౌందర్య, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విశాల్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జెస్సు అనిల్ కుమార్, జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనునాయక్, కోశాధికారి కెంపుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, విద్యార్థులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

యువకుడి హత్య కేసులో నలుగురు అరెస్ట్

- హత్యకు ఉపయోగించిన ఆయుధాలు సెల్‌ఫోన్లు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించిన డి.ఎస్.పి ఆదినారాయణ

భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదురుగడ్డ గ్రామానికి చెందిన మేడి అఖిల్ హత్య కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు టెక్నికల్ టీమ్ సహకారంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించి కేసును చేదించినట్లుగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ బుధవారం లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నమ్మదగిన సమాచారం మేరకు లక్ష్మీదేవిపల్లి ఎస్సై అఖిల తన సిబ్బందితో కలిసి కొత్తగూడెం బస్‌స్టాండ్ సమీపంలో నిందితులు దంత్యాల గణేష్ అలియాస్ గని, సిరిపురం సాత్విక్ అలియాస్ చిన్ను, ముద్దంగుల వెంకటేష్ అలియాస్ చిన్ని, తరాల ప్రదీప్‌లను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం గతంలో జరిగిన గొడవలు వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ప్రధాన నిందితులుగా పేర్కొన్న గణేష్, సాత్విక్‌లు అఖిల్‌పై పగ పెంచుకొని హత్యకు పథకం రచించారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మద్యం తాగిస్తామని నమ్మించి అఖిల్‌ను ఎదురుగడ్డ గ్రామంలోని రేకుల షెడ్డు సమీపంలోని ఖాళీ ప్రదేశానికి తీసుకువెళ్లి ఈనెల 19వ తేదీన తెల్లవారు జామున సుమారు 3 గంటల సమయంలో గణేష్ కత్తితో అఖిల్ మెడపై పలుమార్లు పొడిచి సిమెంట్ ఇటుకతో ముఖంపై దాడి చేయగా సాత్విక్ కూడా సిమెంట్ ఇటుకతో దాడి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందన్నారు. ఈ దాడిలో అఖిల్ మృతి చెందాడని ఈ హత్యకు సంబంధించి మిగిలిన నిందితులు సైతం ముందస్తు పథకంలో భాగంగా సహకరించినట్లు తేలిందన్నారు. మద్యం కొనుగోలు తదితర అవసరాల కోసం ఫోన్‌పే ద్వారా నగదు లావాదేవీలు జరిగినట్లు విచారణలో గుర్తించినట్లుగా తెలిపారు. నిందితుల వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఫోన్‌పే లావాదేవీలకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. హత్యకు ఉపయోగించిన కత్తి రక్తపు మరకలు ఉన్న దుస్తులను స్వాధీనం చేసుకొని తదితర ఆధారాలకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. వ్యక్తిగత కక్షలు పాత గొడవల కారణంగా హింసాత్మక చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకొని నేరాలకు పాల్పడవద్దని సమస్యలు తలెత్తినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. నేరాలకు పాల్పడిన వారు ఎంతకాలం పరారీలో ఉన్నా సాంకేతిక ఆధారాలు పోలీసుల దర్యాప్తు ద్వారా గుర్తించి చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. ఈ కేసులో నిందితుల పాత్ర ఆర్థిక లావాదేవీలు ఇతరుల ప్రమేయం తదితర అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారని నిందితులపై చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కేసును చేదించడంలో టెక్నికల్ టీమ్ సహకారం కీలకంగా నిలిచిందని డీఎస్పీ ఆదినారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అఖిల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుమార్తె ప్రేమ వివాహం తండ్రి ఆత్మహత్య



- వెల్మల్‌లో విషాద ఘటన.. పొలంలో చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణం
- భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

వెల్మల్, అక్టోబర్ 28: కుమార్తె తనకు ఇష్టం లేని వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకొని వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్మల్ గ్రామంలో విషాదాన్ని నింపింది.గ్రామానికి చెందిన బండకాడి రాజన్న (50)కు నలుగురు కుమార్తెలు. ఆయన చిన్న కుమార్తె బండకాడి ఆకాంక్ష (19) అదే గ్రామానికి చెందిన విజయ్‌ను ప్రేమించింది. ఈ క్రమంలో బుధ వారం ఇంటి నుంచి వెళ్లిపోయి అతడిని వివా హం చేసుకుంది. తనకు ఇష్టం లేని వివాహం చేసుకొని కుమార్తె వెళ్లిపోవడంతో రాజన్న తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం.
ఈ క్రమంలో బుధవారం ఉదయం తన పొలానికి వెళ్లిన రాజన్న అక్కడి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.మృతుడి భార్య బండకాడి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం శవ పంచనామా నిర్వహించి, ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- సిబ్బంది సమయపాలన పాటించాలి
- అర్నాబ్ తుఫాన్ వల్ల ముందస్తు చర్యలు చేపట్టాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు
- పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):
రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంతోపాటుగా వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని లేనిచో చర్యలు తప్పవని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. జిల్లాలో అర్నాబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న గర్భిణీ మహిళలు, ముఖ్యంగా ప్రసవ సమయం దగ్గరపడిన గర్భిణీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అవసరమైన వారిని సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాలు లేదా సబ్ సెంటర్లకు ముందుగానే తరలించే ఏర్పాట్లు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు సిబ్బంది హాజరు రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు మందుల నిల్వలు వాటిని భద్రపరిచే స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి వైద్య సేవల నిర్వహణపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు వర్షాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వైరల్ జ్వరాలతో పాటు డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వర లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వ్యాధులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని ఆదేశించారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యులు సిబ్బంది ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మందుల నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వర్షాల కారణంగా భవనంలో ఎక్కడైనా నీటి లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలని సూచించారు. వైద్యులు వైద్య సిబ్బంది విధులకు నిర్ణీత సమయానికి హాజరై తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యత రోగులకు అందుతున్న సౌకర్యాలు సిబ్బంది పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ తనిఖీలో మెడికల్ ఆఫీసర్ హరీష్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ సుభద్ర, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు.. పాఠశాలల పరిస్థితిపై ఎమ్మెల్యే రాకేశ్ ఆరా

- **మాక్లూర్ మండలం చిన్నాపూర్, ధర్మోరా ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మికంగా పర్యటన**

మాక్లూర్, అక్టోబర్ 28: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి బుధవారం నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని చిన్నాపూర్, ధర్మోరా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల సమస్యలు, పాఠశాలల్లో నెలకొన్న ఇబ్బందులపై ఆరా తీశారు. పాఠశాలల పరిస్థితిని పరిశీలించిన ఆయన విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలు, విద్యా బోధనకు సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంతో పాటు, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే ఈ పర్యటన చేపట్టారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై దృష్టి సారించారు. విద్యార్థుల ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పన విషయంలో ఎమ్మెల్యే పర్యటనతో సమస్యల పరిష్కారంపై ఆశలు వ్యక్తమవుతున్నాయి.

అర్నాబ్ తుఫాన్ ఎఫెక్ట్

- **కూల్ కూల్ వాతావరణం**

భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి): అర్నాబ్ తుఫాన్ కారణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కూల్.. కూల్ గా మారింది. బుధవారం తెల్లవారు జాము నుండి కురుస్తున్న వర్షం కారణంగా ఒకసారిగా వాతావరణం చల్లబడింది. అంతేకాకుండా చల్లటి గాలిలో విస్తుండడంతో ప్రజలు స్వెటర్లను బయటకు తీయాల్సిన పరిస్థితి నెలకొంది.
దీనికి తోడు చల్లని వాతావరణం ఏర్పడడంతో కొందరికి వేడి వేడి సమోసాలు, బజ్జీలు, పకోడీలతో పాటు ఒక కప్పు అల్లం టీ లేదా ఫిల్టర్ కాఫీ ని ఆస్వాదిస్తూ ప్రజలు సేద తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది.

క్రీడాకారులకు అండగా ఎమ్మెల్యే జీఎంఆర్

- **సొంత నిధులతో స్పోర్ట్స్ కిట్ల పంపిణీ**

పటాన్‌చెరు, అక్టోబర్ 28(విశాలజ్యోతి), ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి క్రీడాకారులకు అండగా నిలుస్తూ, ఢిల్లీలో నవంబర్ 1 నుంచి 5 వరకు జరిగే 70వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ కుస్తీ పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొనే అండర్-17 బాలబాలికల జట్లకు సొంత నిధులతో స్పోర్ట్స్ కిట్లను అందజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నామని, తెలంగాణ జట్టు జాతీయస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. జట్టు కోసం రూ.1.50 లక్షలతో స్పోర్ట్స్ కిట్లు, భోజన వసతి, ప్రయాణ ఖర్చు లను అందించినట్లు తెలిపారు.

ఆర్మూర్‌లో రోడ్ల దుస్థితి
ప్రజల ప్రాణాలతో చెలగాటం

- **గుంతల రోడ్లపై గమ్యం చేరేదెలా? అధికారులకు కనిపించడం లేదా?**
- **పెరికిట్--నిర్మల్ రహదారి అధ్వానం.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?**
- **అధికారులు స్పందించి తక్షణ మరమ్మతులు చేపట్టాలని డిమాండ్**

ఆర్మూర్, అక్టోబర్ 28: ఆర్మూర్ పట్టణంలోని పెరికిట్ నుంచి నిర్మల్ వైపు వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలు, వాహనాలు వెళ్లినప్పుడు లేచే దుమ్ముతో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

గుంతలు తప్పించబోయి ప్రమాదాల బారిన పడే పరిస్థితి

ఈ మార్గంలో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతోపాటు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. భారీ వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము విపరీతంగా లేవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించని పరిస్థితులు నెలకొంటున్నాయని చెబుతున్నారు.

ఫంక్షన్ హాళ్లకు వెళ్లే మార్గంలోనూ ఇదే దుస్థితి

పాత జాతీయ రహదారి ఎన్‌హెచ్-44 పరిధిలోని ఈ ప్రాంతంలో రెండు, మూడు ఫంక్షన్ హాళ్లు ఉండటంతో వివాహాలు, ఇతర శుభకార్యాల సమయంలో రాకపోకలు మరింత పెరుగుతుంటాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. ఇలాంటి రద్దీ మార్గంలో రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులకు కనిపించని సమస్యా?

ప్రజాప్రతినిధులు సైతం ఇదే ప్రాంతంలోని ఫంక్షన్ హాళ్లకు వివిధ కార్యక్రమాలకు హాజరవుతుంటారు. అయినప్పటికీ రహదారి దుస్థితిపై ఎందుకు దృష్టి సారించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కార్లలో ప్రయాణించే వారి కంటే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ఆధారపడే సామాన్య ప్రజలే ఈ పరిస్థితితో ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు.

పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు సురక్షిత రహదారులు కల్పించరా?

ప్రభుత్వానికి వివిధ రూపాల్లో పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు కనీసం గుంతలు లేని రహదారిని అందించడం ప్రభుత్వ బాధ్యత కాదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్ల దుస్థితి వల్ల నిత్యం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడం ఏమిటని నిలదీస్తున్నారు.

తక్షణ మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

పెరికిట్ నుంచి నిర్మల్ వైపు వెళ్లే రహదారిని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ముందుగా గుంతలను పూడ్చి అత్యవసర మరమ్మతులు చేపట్టడంతోపాటు, అవసరమైన నిధులు కేటాయించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు దుమ్ము నియంత్రణ చర్యలు చేపట్టి, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ముందే మేల్కొనాలి!

ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లిన తర్వాత హడావుడి చేసే కంటే, ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఈ రహదారిపై దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే ఊరుకోం
రైస్ మిల్లర్లకు ప్రభుత్వ వార్నింగ్

రాష్ట్రంలో బియ్యం ధరలు అమాంతం పెరగకుండా, సామాన్యులకు అందుబాటులో ఉండేలా తెలంగాణ ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. పౌర సరఫరాల శాఖ కమిషనర్ శ్రీ ఎం. స్టీఫెన్ రవీంద్ర (ఖ్రూా) ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని సివిల్ సప్లై భవన్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ నేతృత్వంలో మిర్యాలగూడ, నిజామాబాద్, నల్గొండకు చెందిన ప్రముఖ రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో ఈ సమావేశం నిర్వహించారు. మార్కెట్లో బియ్యం కొరత లేకుండా చూడాలని, వినియోగదారులకు అందే ధరలను అదుపులో ఉంచాలని ఈ సందర్భంగా వారికి స్పష్టం చేశారు.ప్రస్తుతం మార్కెట్లో ఉన్న బియ్యం నిల్వలన్నీ గత సీజన్‌కు చెందినవే కాబట్టి, ధరలను అమాంతం పెంచడానికి వీల్లేదని అధికారులు వ్యాపారులకు తేల్చిచెప్పారు. కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమంగా బియ్యాన్ని గోదాముల్లో దాచిపెట్టినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. వ్యాపారుల లాభాపేక్ష వల్ల సామాన్య ప్రజలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అధికారులు స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఉపేక్షించేది లేదని తెలిపారు.
ధరలను అదుపులో ఉంచడంతో పాటు ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరించాలని మిల్లర్లకు అధికారులు సూచించారు. పరిస్థితిని బట్టి మార్కెట్లో ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్లు తెరిచి బియ్యం విక్రయిస్తుందని, అప్పుడు ఆ కౌంటర్లకు ఎలాంటి అంతరాయం లేకుండా బియ్యం సరఫరా చేయాలని అధికారులు స్పష్టం చేశారు.ఎప్పటికప్పుడు మార్కెట్‌ను పర్యవేక్షిస్తూ, ప్రజల సంక్షేమం కోసం పౌర సరఫరాల శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తోందని అధికారులు వెల్లడించారు. పారదర్శకతతో పాటు, సామాన్యులకు అందుబాటులో ఉండే ధరల ద్వారా ప్రజలందరికీ ఆహారం అందేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

పచ్చికొబ్బరి తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు ఎందుకో తెలుసా

తరచూ పచ్చికొబ్బరితింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. కొంతమంది పచ్చికొబ్బరిని చాలా ఇష్టంగా తింటారు. అల్పాహారాల్లో చట్నీగా, తీపి వంటకాల్లో పచ్చి కొబ్బరిని వినియోగిస్తుంటారు. చక్కెరగానీ, బెల్లంగానీ కలుపుకుని కూడా తింటుంటారు. అయితే కొంతమంది మాత్రం దగ్గు వస్తుందని, బరువు పెరుగుతామని ఈ పచ్చి కొబ్బరిని దూరం పెడుతారు. కానీ నిపుణులైతే పచ్చి కొబ్బరితో లాభాలే తప్ప నష్టాలు లేవని చెబుతున్నారు. పచ్చి కొబ్బరిని తరచూ తగిన మోతాదులో తీసుకుంటే చాలా అనారోగ్య సమస్యలు దూరమవుతాయంటున్నారు. పచ్చికొబ్బరి యాంటీ బయోటిక్‌గా పని చేస్తుందని, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుందని అంటున్నారు. పచ్చి కొబ్బరితో ఉండే ఆ లాభాలేమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

పచ్చి కొబ్బరితో లాభాలు..

రోగ నిరోధక శక్తి

పచ్చికొబ్బరిని వీలైనప్పుడల్లా తింటూ ఉంటే మనలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాంతో శరీరం వైరస్, బ్యాక్టీరియాలతో సమర్థంగా పోరాడుతుంది. ఇన్‌ఫెక్షన్‌ల బారినపడే ప్రమాదం తప్పుతుంది.

మంచి కొలెస్ట్రాల్

పచ్చి కొబ్బరిని తరచూ తీసుకోవడంవల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. దాంతో రక్తంలో ఎలాంటి మలినాలు ఏర్పడవు. గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

జీర్ణ శక్తి

పచ్చికొబ్బరిలో పీచు పదార్థం (ఫైబర్) ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తిన్న ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. దాంతో జీర్ణ సమస్యలు కూడా త్వరగా రావు. అలాగే మలబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది.

అదుపులో థైరాయిడ్

చాలామంది థైరాయిడ్ సమస్యతో బాధపడుతూంటారు. ఇలాంటి వారికి పచ్చికొబ్బరి బాగా సాయపడుతుంది. పచ్చికొబ్బరిలో ఉండే పోషకాలు థైరాయిడ్‌ను తగ్గిస్తాయి.

మెదడు ఆరోగ్యం

తరచూ పచ్చికొబ్బరి తినడంవల్ల మెదడు ఆరోగ్యంగా పని చేస్తుంది. అల్జీమర్స్ లాంటి సమస్యలు రాకుండా ఉంటాయి.

పిల్లల ఎదుగుదలకు

ఎదిగే పిల్లలకు పచ్చికొబ్బరి చాలామేలు చేస్తుంది. పచ్చికొబ్బరిలో వారికి కావాల్సిన పోషకాలు అందుతాయి. దాంతో పిల్లల్లో ఎదుగుదల చక్కగా ఉంటుంది. రక్తహీనత సమస్య తగ్గుతుంది. అలాగే చిన్న వయసులోనే ఎముకలు, కండరాలు గట్టిపడతాయి. కావాల్సిన శక్తి లభిస్తుంది.

చర్మం, కేశాల ఆరోగ్యంపచ్చికొబ్బరి తరచూ తినడంవల్ల చర్మం, కేశా లు ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతి వంతమవుతుంది. వృద్ధాప్య ఆగిపోతుంది.

తీరందాటిన 'అర్నబ్' తుఫాన్ రేపు ఏపీ కేబినెట్ అత్యవసర భేటీ

- **అమరావతిలో ఉదయం 10:30 గంటలకు సమావేశం**
- **తుఫాన్ నష్టంపై సమీక్ష.. బాధితులకు పరిహారంపై చర్చ**
- **పంట నష్టం అంచనా, సహాయక చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం**

అమరావతి, అక్టోబర్ 28: అర్నబ్ తుఫాన్ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నష్ట నివారణ, సహాయక చర్యలపై దృష్టి సారించింది. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించి, బాధితులను ఆదుకునే చర్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రేపు ఉదయం 10:30 గంటలకు అమరావతి సచివాలయంలో ఏపీ మంత్రిమండలి అత్యవసరంగా సమావేశం కానున్నట్లు సమాచారం.

నష్టం అంచనాపై ప్రధానంగా చర్చ

తుఫాన్ ప్రభావంతో తీరప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా పంటలు, ఇళ్లు, రహదారులు, విద్యుత్ వ్యవ స్థలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమా చారం. ఆయా శాఖల అధికారులు రూపొందించిన నష్టం అంచనాలను సమావేశంలో పరిశీలించే అవకాశం ఉంది. నష్ట తీవ్రతను బట్టి బాధితులకు పరిహారం అందించే అం శంపై చర్చించనున్నారు.

రైతులకు పరిహారంపై దృష్టి

తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడం, పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేయడం, పరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేయడంపై మంత్రివర్గం దృష్టి సారించనుంది. అలాగే దెబ్బతిన్న విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ, తాగునీటి సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావడం వంటి అంశాలపైనా సమీక్షించే అవకాశం ఉంది.

బాధితులకు తక్షణ సాయం

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక శిబిరాల నిర్వహణ, బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందించడం, పున రావాస చర్యలను పర్యవేక్షించడం వంటి అంశాలు సమావేశంలో ప్రాధాన్యం సంతరి ంచుకోనున్నాయి.వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనే ఈ భేటీలో క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి చర్యలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

సీఐడీలో ఏడు డిజిటల్ సేవలు ప్రారంభం.. జైళ్ల నుంచి విడుదలయ్యే ఖైదీలపై నిఘా

హైదరాబాద్, అక్టోబర్ 28: పోలీసు సేవలను మరింత పారదర్శకంగా, వేగంగా, సమర్థంగా అందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నేర పరిశోధన విభాగం (సీఐడీ) రూపొందించిన ఏడు డిజిటల్ సేవలను డిజిపి సీవీ ఆనంద్ డీజీపీ కార్యాలయంలో ప్రారంభించారు.పౌరుల అభిప్రాయాల సేకరణకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్..
పోలీసు సేవలను ఇటీవల వినియోగించుకున్న ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్

(సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేశారు. పిటిషన్లు, ఎఫ్ఐఆర్‌ల నమోదు, ఈ-చలాన్లు, పాస్‌పోర్టు వెరిఫికేషన్ సేవలపై ప్రజల స్పందనను ఈ కేంద్రం సేకరిస్తుంది.భరోసా కేంద్రాలకు డిజిటల్ సేవలు..మహిళా భద్రతా విభాగం రూపొందించిన 'భరోసా' సాఫ్ట్‌వేర్ ద్వారా రాష్ట్రంలోని 35 భరోసా కేంద్రాలను ఒకే వేదికపైకి తీసు కొచ్చారు. బాధితులకు అందించే కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పునరావాస సేవల వివరాలను నమోదు చేసి, కేసు ప్రారంభం నుంచి ముగింపు వరకు పర్యవేక్షించవచ్చు.

PRGI No: TGBIL/25/A0946
విశాలజ్యోతి
సమగ్ర తెలుగు దినపత్రిక

శ్రీవేంకటేశ్వర స్వామివారి సేవలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యుడు ఎన్. నర్సిరెడ్డి, ప్రముఖులు

హైదరాబాద్, అక్టోబర్ 28
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో సహస్ర దీపాలంకార సేవ భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు ఎన్. నర్సిరెడ్డి, డైరెక్టర్ త్రినాథరావు, గడ్డం రవికుమార్, రైటర్ శ్రీనివాస్ పాల్గొని శ్రీవారి సేవలో భాగస్వాములయ్యారు. తిరుమలలో భక్తుల ఆధ్యాత్మిక అనుభూతిని మరింత పెంపొందించే సహస్ర దీపాలంకార సేవలో భాగంగా వెలిగించిన దీపాల కాంతులు ఆలయ ప్రాంగణంలో భక్తిమయ వాతావరణాన్ని నింపాయి. శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటూ, భక్తిప్రపత్తులతో నిర్వహించిన ఈ సేవలో పాల్గొన్న ప్రముఖులు స్వామివారి ఆశీస్సులు పొందారు. శ్రీవారి సన్నిధిలో పవిత్రమైన సహస్ర దీపాలంకార సేవలో పాల్గొనడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. తిరుమల క్షేత్రంలో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, సమాజంలో సుఖశాంతులు, సౌభాగ్యాలు వెల్లివిరియాలని వారు ఆకాంక్షించారు.

రంగంపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

వరంగల్ , అక్టోబర్ 28: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు 11వ డివిజన్ రంగంపేటలోని రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ సమద్, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి--సురేందర్, కార్పొరేటర్‌గా పోటీ చేసిన గన్నారపు కమల్, డివిజన్ కాంగ్రెస్ తాజా మాజీ అధ్యక్షుడు గన్నారపు సంగీత్‌కుమార్, సీనియర్ నాయకులు పులుగం సదానందం, గద్దల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామజిక బాధ్యత తో యువత ముందుకు సాగాలి..

రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షుడు డా. కూన వేణుగోపాలకృష్ణ

పటాన్ చెరు /అక్టోబర్ 28: సామజిక బాధ్యత తో యువత ముందుకు సాగాలని రాష్ట్ర యువజన సంఘాల సమితి అధ్యక్షుడు డా. కూన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం జిన్నారం వచ్చిన అయనను యువజన సంఘాల సమితి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అదేవిధంగా తహసీల్దార్ ను కలిసి యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన సంఘాల సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఆది రామకృష్ణ, జిన్నారం గ్రామానికి చెందిన యువజన నాయకుడు పుట్టి భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యువజన సంఘాల సమితి కమిటీలను ఏర్పాటు చేస్తూ యువతను సామాజిక సేవా కార్యక్రమాల వైపు నడిపించడం అభినందనీయమన్నారు. యువజన సంఘాలకు ప్రత్యేక గుర్తింపు తీసు కురావడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి యువతను సంఘటితం చేయడంలో రాష్ట్ర అధ్యక్షుడు డా. కూన వేణుగోపాలకృష్ణ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతూ పేదలకు సహాయం, విద్యార్థులకు చేయూత, ప్రజా సమస్యల పరిష్కారం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. జిల్లాలో యువజన సంఘాల సమితిని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్రస్థాయి నాయకత్వం సహకరించాలని కోరారు. జిల్లాలోని యువతకు సమితిలో బాధ్యతలు అప్పగించి, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడానికి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు ఆది రామకృష్ణ, పుట్టి భాస్కర్, పోచమ్మల స్వామి, సాయి రెడ్డి , భూమయ్య ,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆడెపు ఓవర్సీస్‌ను సందర్శించిన రమేష్ పాక

హనుమకొండ , అక్టోబర్ 28: హనుమకొండ గ్రీన్ స్క్వేర్ ప్లాజాలోని ఆడెపు ఓవర్సీస్ కన్సల్టెన్సీని తెలంగాణ తహసీల్దార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక సందర్శించారు. ఈ సందర్భంగా కన్సల్టెన్సీ అధినేత ఆడెపు మధుసూదన్ ఆయనకు స్వాగతం పలికారు.
విదేశాల్లో ఉన్నత విద్య కోసం విద్యార్థులకు అందిస్తున్న మార్గదర్శకత్వం, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశ ప్రక్రియ, ఇతర సేవల గురించి రమేష్ పాక అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశాలు కల్పిస్తూ, వారి భవిష్యత్తుకు కృషి చేస్తున్న ఆడెపు ఓవర్సీస్ సేవలను అభినందించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సంస్థ అందిస్తున్న మార్గదర్శకత్వం అభినందనీయమని పేర్కొన్నారు.

చదువుతో పాటు చేతివృత్తుల్లోనూ నైపుణ్యం సాధించాలి

- **ఆర్టిఫిషియల్ ఆభరణాల తయారీలో శిక్షణ.. విద్యార్థినులకు ధ్రువపత్రాల ప్రదానం..**
- **జూట్ సంచుల తయారీ, పుట్టగొడుగుల పెంపకంలోనూ శిక్షణ**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, /

చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జీవన్ కుమార్ విద్యార్థినులకు సూచించారు. సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ద్వారా ఆర్టిఫిషియల్ ఆభరణాల తయారీలో శిక్షణ పూర్తి చేసుకొని ధ్రువపత్రాలు పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్య శిక్షణలు విద్యార్థినులకు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు దోహదపడతాయని తెలిపారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలతో పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ఆభరణాలను తయారు చేసి ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. విద్యార్థినులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ కాళ్లపై తాము నిలబడాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో జూట్ సంచుల తయారీతో పాటు పుట్టగొడుగుల పెంపకంలోనూ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఈ శిక్షణల్లో పాల్గొని తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. వివరాల కోసం కళాశాల లేదా ఆర్ఎస్ఈటీఐ సంస్థను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, డాక్టర్ స్రవంతి, కిషోర్, హరిప్రసాద్, తిరుపతి, ఆర్ఎస్ఈటీఐ కౌన్సిలర్ మహమ్మద్ నజీమ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలీసు సేవలపై పౌరుల అభిప్రాయ సేకరణ

- **సీఐడీలో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్ ప్రారంభం**
- **35 భరోసా కేంద్రాలను అనుసంధానిస్తూ డిజిటల్ కేసు నిర్వహణ వేదిక**

హైదరాబాద్
: పౌరులకు వృత్తినైపుణ్యంతో కూడిన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా నేర పరిశోధన విభాగం (సీఐడీ)లో పలు డిజిటల్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పోలీసు సేవల నాణ్యత, సిబ్బంది ప్రవర్తనపై ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్‌ను అందుబాటు లోకి తీసుకొచ్చారు. పోలీసు స్టేషన్లలో రిసెప్షన్ సేవలు పొంది నవారు, ఎఫ్ఐఆర్ నమోదు చేయించినవారు, పాస్‌పోర్టు దరఖాస్తులకు సంబంధించి పోలీసు ధ్రువీ కరణ పూర్తయినవారు, స్పాట్ ఈ--చలాన్లు అందుకున్న పౌరులను ఈ కేంద్రం సిబ్బంది నేరుగా సంప్రదించను న్నారు. ఆయా సందర్భాల్లో అందిన సేవలు, పోలీసుల ప్రవర్తనపై అభిప్రాయాలు సేకరిస్తారు. పౌరులు ప్రస్తావించే సమస్యలను సమీక్షించి, తదుపరి చర్యలు చేపట్టనున్నారు.



వేలిముద్రల విశ్లేషణకు సాంకేతిక తోడ్పాటు
మొత్తం 35 భరోసా కేంద్రాలను అనుసంధానిస్తూ డిజిటల్ కేసు నిర్వహణ వేదికను ప్రారంభించారు. సీఐడీ నూతన వెబ్‌సైట్‌తోపాటు వేలిముద్రల విశ్లేషణను వేగవంతం చేసేందుకు, పదేపదే నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉంచేందుకు సాంకేతిక ఆధారిత వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఐదు సంపుటాలుగా ప్రామాణిక విధానాలు
పోలీసు సిబ్బందికి దర్యాప్తులో మార్గదర్శకంగా ఉండేందుకు ఐదు సంపుటాల ప్రామాణిక కార్యాచరణ విధానాలను (ఎస్ఓపీలు) విడుదల చేశారు. శారీరక దాడులు, ప్రాణహాని సంబంధిత నేరాలు, ఆస్తి నేరాలు, మహిళలు--పిల్లలపై నేరాలు, ప్రత్యేక--స్థానిక చట్టాలు, ఇతర నేరాలకు సంబంధించిన విధానాలను వీటిలో పొందుపరిచారు. ప్రతి పౌరుడికి నాణ్యమైన పోలీసు సేవలు అందించడంతోపాటు సిబ్బందికి అవసరమైన సాంకేతిక సాధనాలు, వ్యవస్థలు, మార్గదర్శకత్వం సమకూర్చడంపై ఈ కార్యక్రమాలు దృష్టి సారిస్తున్నాయి.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం..

- **పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో 186 మంది రక్తదానం**
- **రక్తదానం సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి**
- **సీపీ సాధన రష్మి పెరుమాళ్**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి,
పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలనే స్ఫూర్తితో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 186 మంది పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం
ఈ సందర్భంగా సీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి స్మృత్యర్థం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసే అవకాశం లభించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. రక్తానికి మరో ప్రత్యామ్నాయం లేదని, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని తెలిపారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారితో పాటు శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే మహిళలు, ఇతర అత్యవసర వైద్యం అవసరమైన వారికి సహాయం చేయవచ్చని వివరించారు. రక్తదానం చేయడం కేవలం సామాజిక సేవ మాత్రమే కాదని, మానవత్వాన్ని చాటుకునే గొప్ప అవకాశమని సీపీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రక్తదాతలకు ప్రశంసాపత్రాలు
సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి విభాగం సమన్వయంతో ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. రక్తదానం చేసిన వారందరికీ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, రక్తనిధి విభాగం వైద్యాధికారి డాక్టర్‌శ్రావణి,పోలీస్‌సిబ్బంది,ప్రభుత్వవైద్య సిబ్బంది పాల్గొన్నారు.

"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.